

విశాలాంధ్ర శ్రీకాకుళం
శనివారం 9, ఆగస్టు, 2025

బాలుడుకి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటీ : కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన కీలు సోమేష్,కుసుమ దంపతులు కుమార్డు యశ్వంత్ 2 ఏళ్ల బాలుడు బ్రెయిన్ ఇన్ఫెక్షన్తో తరచూ ఫిట్సు వచ్చి పడిపోతున్నాడు. డాక్టర్లను సంప్రదించగా దీనికి ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్య ఖర్చులు అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయం ఆ గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు స్పందించి శుక్రవారం బాలుడికి రూ. 15, 500లు ఆర్థిక సాయం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎ.సురేష్ కుమార్, టి.ఆశీష్ కె.భాస్కర్, టి.గోపాల్, టి.రవి, ఎ.మిన్నారావు, ఎస్.గున్నయ్య, ఈ.కృష్ణ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

13న క్విట్ కార్పొరేట్ డే ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న మోడీ విధానాలకు నిరసనగా ఆగస్టు 13న క్విట్ కార్పొరేట్ డే ను జయప్రదం చేయండి సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర.ప్రకాష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన రావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.చందు, పి.కగేష్ పిలుపు నిచ్చారు. ఆగస్టు 13న క్విట్ కార్పొరేట్ నినాదంతో ట్రాక్టర్ ర్యాలీలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని కోరుతూ రైతు, కౌలురైతు, కార్మిక, విద్యార్థి వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు శ్రీకాకుళం సిఐటియూ ఆఫీసులో కరపత్రాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3వసారి అధికారం చేపట్టిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం రద్దయిన 3నల్లచట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందని, ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదని,ప్రభుత్వ ఏజెన్సీల కొనుగోలు చేయవని అన్నారు. రైతులు నేరుగా గాని, ఎఫ్పిఒ గ్రూపులుగా గాని అగ్రిమెంట్ చేసుకుని కంపెనీల రూల్స్ ప్రకారం పంటలు పండించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధి ఎత్తివేసిందని అన్నారు.ఎరువులు, పరికరాలపై సబ్సిడీలు కోత విధించిందని, పది సంవత్సరాలు దాటిన ట్రాక్టర్ల పై నిషేధం విధించిందని,ఎఫ్సిఐ తదితర గోడౌన్లన్ని అదానీకి అప్పగించిందని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనడం లేదన్నారు. రష్యా నుండి మనకు చౌకగా లభ్యమవుతున్న చమురు నిషేధిస్తే మనం వ్యవసాయంలో ఆయిల్ వినియోగించే స్ప్రేయర్ల నుండి ట్రాక్టర్లు కోత యంత్రాల వరకు ఖర్చులు పెరిగిపోతాయని అన్నారు. మనం ఎగుమతి చేసే వస్తువులపై 25% సుంకం వేస్తానని ట్రంప్ బెదిరిస్తుంటే మన ప్రధాని మౌనంగా ఉండడం ప్రమాదం కాదా అని ప్రశ్నించారు.ఈ ఏడాది మనం ఎగుమతి చేయగలిగిన మిరపకాయలు, పొగాకు, మామిడిపండ్లు, పప్పుధాన్యాలు, శనగలు పంటల ధరలన్నీ పడిపోయాయని అన్నారు. వ్యాపారులందరూ ఏకమై ధరలు తగ్గించి వేశారని, తాజాగా మనం ఎగుమతి చేసే రొయ్యలు సైతం ధరలు పడిపోయాయని, మన దేశ అవసరాలకు సరిపడా పండుతున్న వరి, గోధుమ, మొక్కజొన్న పంటలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ విరమింప చేయాలని, మన రైతాంగానికి నష్టకరమైన మార్కెట్ చట్టాన్ని రద్దు చేయించాలని, అందుకు సకల రైతాంగాన్ని కదిలించాలని పిలుపునిచ్చారు. దేశంలోని ట్రేడ్ యూనియన్లు అన్ని మనకు మద్దతు ఇస్తున్నాయని వారి మద్దతు తీసుకుని ఆగస్టు 13న క్విట్ కార్పోరేట్ నినాదంతో ట్రాక్టర్ ర్యాలీలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని అన్నారు.

కళాకారులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటీ : శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ వారు కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన ప్రముఖ ఘంటశాల గాత్ర అనువంశికులు దేవాడ ఎర్రయ్య మరియు ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామానికి చెందిన డోలక్ కళాకారుడు తర్ని శేషగిరి ఆచారిలకు ఆరోగ్య పరిస్థితి బాగులేనందున శ్రీమహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ వారు శుక్రవారం ఇరువురుకు రూ. 10,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సలహాదారులు తిప్పిన దాలయ్య రెడ్డి, తిప్పన ధనుంజయ రెడ్డి సంస్థ అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, నర్తు గంగయ్య, చలపతి, వినోద్ కుమార్, కొప్పల హేమంత్, డి.వెంకటేశం, బి.రామా రావు, బాలరాజు, పురుషోత్తం, కె.లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో బోర్ రిపేర్..
సర్పంచ్ దేవుదల సుందరమ్మ

విశాలాంధ్ర - హిరమండలం : శుక్రవారం మండల కేంద్రమైన హిర మండలం మేజర్ పంచాయతీ పెద్ద కోరాడ వీధిలో ఉన్న బోరింగ్‌ను పంచాయతీ నిధులు తోవార్డు మెంబెర్స్ పుప్పాల మురళి, సమేనా కృష్ణ ల పర్యవేక్షణ లో మరమ్మత్తులు చేయించినట్లు సర్పంచ్ దేవుదల సుందరమ్మ, పంచా యతీ ఈఓ ఎం భాస్కర్ రావులు విలేకరులకు తెలిపారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ సుందరమ్మ మాట్లా డుతూ గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు చాలా తక్కువ అయి నప్పటికీ పంచాయతీ సిబ్బందికి గాని మరమ్మత్తులు గాని ఎలాంటి లోటు రానివ్వకుండా చూస్తున్నమని కొనియాడారు. తాగు నీటి బోర్‌లు రిపేర్‌లు తరచూ వస్తుండడం రిపేర్‌లు చేయించడం సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించడం జరుగుతుందని ఈ సందర్భంగా చెప్పు కొచ్చారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ పర్యటన విజయవంతం చేయండి
కార్గో ఎయిర్ పోర్ట్ పోరాట కమిటీ నాయకులు పిలుపు

విశాలాంధ్ర - మందస : ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గత తొమ్మిది నెలలుగా చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ ఈ నెల 12న పలాస నియోజకవర్గం మందస, వజ్రపుకొత్తూరు మండలాలలో పర్యటనకు వస్తున్నారని దీనిని విజయవంతం చేయాలని కార్గో ఎయిర్ పోర్ట్ పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం గంగువాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా రాంపురం గ్రామంలో నారాయణ పర్యటన ప్రారంభమవుతుందని, బాధిత ప్రజల పక్షాన పోరాడే నాయకులు వస్తున్న సందర్భంగా కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత గ్రామాల నుండి రైతులు, మత్స్యకారులు,ప్రజా సంఘాలు నాయకులు, పౌరహక్కుల నాయకులు, పర్యావరణ ప్రేమికులు, ఉద్యమ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. గత 9 నెలలుగా ప్రభావిత గ్రామాల రైతులు ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న ప్రభుత్వంలో చలనం లేదని, ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచి రైతులకు అండగా నిలబడడానికి వస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ పర్యటన జయప్రదం చేయవలసిందిగా కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మ రావు, డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ సభ్యులు బత్తిని లక్ష్మణ్, బాధిత రైతులు దున్న హరిక్రిష్ణ, మర్ల సంతోష్, పొట్టి ఎర్రయ్య, నల్ల పరుశురాం, రత్నాల చలపతి, దాసరి మోహన్ రావు,పొట్టి యోగేశ్వర్ రావు,దున్న సురేష్, చిత్త గున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం
ప్రజా దర్బార్‌లో మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ 69 ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలి నియోజకవర్గం నిమ్మడ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ప్రజాసమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ ప్రజా దర్బార్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. అలాగే నూతన పింఛన్లు మంజూరు చేయాలని నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందు తున్నాయి. త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందని, అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని, ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన కొన్ని వినతులను పరిశీలించి సంబంధిత అధికారులతో చెరవాణిలో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే విధులలో అలసత్వం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించిన తహశీల్దార్ రామారావు

విశాలాంధ్ర - జలుమూరు : మండలం చల్లవానిపేట జంక్షన్ లో ఉన్న రెండు ఎరువులు దుకాణాలను శుక్రవారం జలుమూరు తాసిల్దార్ జెన్ని రామారావు ఆకస్మికంగా తనిఖీ నిర్వ హించారు. గిడ్డంగిలో ఉన్న సరుకులను రికార్డులో ఉన్న వాటిని పరిశీలించారు. రైతులకు అందు బాటులో ఎరువు ఉండాలని ప్రభుత్వ నిబంధనల మేరకే కార్యక్రమాలు జరపాలని ఆయన సూచించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడిన చట్టరీత్యా చర్యలు తప్పవని తాసిల్దార్ హెచ్చరించారు. ఆయనతో సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డిపోను తొలగించడం అన్యాయం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస మండలం, కె.మునుగవలస గ్రామానికి చెందిన మునుగవలస ధనలక్ష్మి కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తమ రేషన్ షాప్‌ను తొలగించిన నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురై రెండు రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం దారుణమని వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్ అన్నారు. గురువారం రిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతూ క్రిటి కల్ కేర్ యూనిట్‌లో ఉన్న ధనలక్ష్మినిను పరామ ర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ విషయంలో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పం దించి భాధితురాలకు రేషన్ డిపోను తిరిగి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని చింతాడ రవి కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చే ప్రాధాన్యత ఇంతేనా అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆమెను ఆదుకోవాలని కోరారు.

11న సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు : సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ సత్యనారాయణ

విశాలాంధ్ర - పలాస : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న కోర్టు ను కాశీబుగ్గ సెక్షన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొనవచ్చున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు తమ ఫిర్యాదులను నేరుగా సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చున్నారు. అదే విధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా నేరుగా గానీ, లిఖిత పూర్వకంగాగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల నుంచి వచ్చిన కేసుల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సుల్లో ఛైర్ పర్సన్ బి సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్ రాజబాబు, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

విశాలాంధ్ర - కవిటీ : ఏ గ్రామంలో కూడా ప్రజలు నీటి ఎద్దడితో బాధపడకూడదని ఎమ్మెల్సీ నర్తు. రామారావు అన్నారు. ఈ మేరకు శు క్రవారం మండల పరిషత్ నిధులు రూ. 1.50 లక్షలతో కవిటి మండలంలోని లండారిపుట్టుగ, పొందూరు పుట్టుగ గ్రామాల్లో నూతనంగా వేసిన మోటర్ బోర్లను ఎంపీపీ ప్రతినిధి, వైసీపీ మండల అధ్యక్షులు కడియాల ప్రకాష్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామా రావు మాట్లాడుతూ మండలంలో ప్రతీ గ్రామంలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యతగల ఖాదీకి ప్రసిద్ధి 'సిక్కోలు' : లయన్ డా.పైడి సింధూర

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నాణ్యతగల ఖాదీకి ప్రసిద్ధి శ్రీకాకుళం (సిక్కోలు) అని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు లయన్ డా.పైడి.సింధూర అన్నారు. మండలం అక్కులపేట గ్రామంలో చేనేత కుటుం బాలను కలసి, వాటి ప్రాముఖ్యత వివరాలను, వస్త్రాలు నేసె విధివిధానాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళంలోని "చేనేత" ఖాదీకి దేశవ్యాప్తంగా మంచి పేరుందని, శ్రీకాకుళం అధిక నాణ్యత గల ఖాదీకి ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. శ్రీకాకుళం చేతితో వడికి, నేసిన ఖాదీకి జాతీయ గుర్తింపును పొందిందని, ఇక్కడ ఉత్పత్తి చేయబడిన ఖాదీని మహాత్మా గాంధీ స్వయంగా ఆదరించారన్నారు. చేనేత నైపుణ్యాలను వెలికితీసి, వారికి అవసరమైన సహకారం అందిస్తామని, యువతలో అవగాహనపెంచి, ఖద్దర్ ప్రాముఖ్యతను, జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలకు విస్తరింప జేయటంలో భాగమౌతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖవైద్యులు డా.మాలతి, కార్యదర్శి టీ.రామ్ గోపాల్, డైరెక్టర్ మాధురి,సభ్యులు శ్రీనివాసరావు,ఎన్. రేణుక లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస ట్రెసరర్ పొన్నాడ రోషిణి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి ధర్మకర్త పదవికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - కోట బొమ్మాళి : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, స్థానిక శ్రీ కొత్తమ్మ తల్లి దేవస్థానానికి ధర్మకర్త పదవికి దరఖాస్తులు చేసుకోవాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి వాకచర్ల రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం కోసం పని దినాల్లో తమ కార్యా లయానికి వచ్చి తీసుకోవాలని ఆయన సూ చించారు. దరఖాస్తులు పూర్తి చిరునామా నింపి పని దినాల్లో 27వ తేదీలోగా కార్యా లయానికి అందజేయాలని రాధాకృష్ణ పిలువునిచ్చారు.

పూర్వాపరాలు తెలుసుకొని విమర్శించాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస మండలం, కె.మునుగవలస గ్రామానికి చెందిన మునుగవలస ధనలక్ష్మి రేషన్ డిపో తొలగించారని ఎమ్మెల్యేను విమర్శించటం సరికాదని ఎస్సీ, ఎస్టీ జిల్లా మోనిటరింగ్ సెల్ కమి టీ సభ్యులు తోట రాములు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పూర్వాపరాలు తెలుసుకొని విమర్శలు చేయాలని అన్నారు. ఓసి కేటగిరీకి చెందిన శారద మృతి చెందడంతో ఎస్సీ కులానికి చెందిన ధనలక్ష్మి శారద వారసు రాలుగా ప్రకటించుకుని గడిచిన ఐదేళ్లు ఎస్హెచ్ గ్రూపు ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారని తెలిపారు. పంపిణీలు జరిగిన అవకత వకలను అధికారులు గుర్తించి ఆమెను తొల గించారని మరో ఎస్హెచ్ గ్రూపునకు చెందిన సూర్య కుమారికి అధికారులు అందించారని తెలిపారు. పర్మినెంట్ డీలర్షిప్ తొలగించినట్లు ప్రచారం చేసుకోవటం తగదన్నారు. ప్రతిపక్ష నాయకులు కూడా పూర్వా పరాలు తెలుసుకొని ఎక్కడనుండి ఎవరికి సంక్ర మించిందో వివరాలు తెలుసుకోవాలని దళితులకు ఇబ్బంది కలిగించే విధంగా మాట్లాడడం తగదన్నారు. ఇప్పటికే పార్టీకి ప్రతిపక్షం కూడా లేకుండా పోయిందని ఇంకా అవాస్తవాలు ప్రకటిస్తే ఉన్న పది సీట్లు ఉండవని గుర్తు చేసుకోవాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో వైసీపీకి దళిత వర్గాలు దూరం కాక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.సింహాద్రి, బి.అప్పన్న, రాజశేఖర్, చిన్నారావులు మాట్లాడుతూ గతంలో వైసీపీ నాయకులు కక్షపూరిత రాజకీ యాలు చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అటువంటి విధానాలకు దూరంగా ఉన్నారని గుర్తు చేశారు. దళితుల పట్ల వైసీపీ కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు.

బెంకిలిలో విషాదం..గ్రామ సేవకురాలు సీతమ్మ హఠాన్మరణం

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం బెంకిలి గ్రామంలో శ్రావణ శుక్రవారంతో పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు జరుగుతున్న సందర్భంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరి నోట్లో నాలుకలా ఉంటూ అందరికీ తన సహాయ సహకారాలు అందిస్తూ మరోవైపు గ్రామ సమీపంలో గల సాధుమెట్టపై ప్రతిరోజు ఆధ్యాత్మిక సేవలలో నిమగ్నమయ్యేవూణే సీతమ్మ హఠాన్మరణం చెందింది. ఒంటరి మహిళగా సోదరుని ఇంటి వద్ద నివశిస్తూ అనేక ఏళ్లుగా గ్రామంలో అన్ని కుటుంబాలతోను సీతమ్మ ఎంతో స్నేహంగా మంచితనంతో ఉండేది. ఏ చిన్నపాటి సహాయం అన్న అందరు సీతమ్మపైనే ఆధారపడేవారు. అటువంటి సీతమ్మ శుక్రవారం ఉదయం సాధుమెట్టపై ఆంజనేయస్వామి సేవ పూర్తి చేసి గ్రామంలో అవసరమైన వారికి పూజకు సరిపడా పువ్వులు తీసుకుని వస్తుండగా మెట్టకు కొద్ది దూరంలో ఉన్న విద్యుత్ స్తంభానికి పట్టుకుని ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కుప్ప కూలే సమయంలో గట్టిగా ఆమె అరుపులు వినిపించడంతో మెట్టపై యోగా సాధనకు వెళ్లిన వారు అరుపులు విని వెంటనే వచ్చి చూసే సరికి అప్పటికే ఆమె ప్రాణాలు విడిచి ఉంది. ముందుగా ఆమె విద్యుత్ షాక్‌తో మరణించి ఉంటుందని అనుమానించారు. కొద్దిసేపటి తర్వాత సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీతమ్మ విద్యుదాఘాతంతో చనిపోయి ఉంటే శరీరంపై గాయాలు అయ్యి ఉండేవని, విద్యుత్‌షాక్‌కు గురైతే సంబంధిత వ్యక్తి కేకలు వేయరని పేర్కొనడంతో పోలీసులు మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లారు. పరిశీలించిన వైద్యులు గుండెపోటుతో మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు. ఆమె పోస్టుమార్టం రిపోర్టు వస్తే ఎలా మృతి చెందిందో నిర్ధారణ కానుంది. ఇదిలా ఉండగా సీతమ్మ మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సహాయకారిగా ఉన్న సీతమ్మ మృతి గ్రామానికి ఎంతో లోటని పేర్కొన్నారు.

ముందస్తు రాఖీ పండగ

విశాలాంధ్ర - కవిటీ : కవిటి మండ లం రామయ్య పుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ముందు రాఖీ పండగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్‌కు చిన్నారులు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం. పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీరు మాకు రక్ష, మేము మీకు రక్ష మనందరం దేశానికి రక్ష అంటూ సాంప్రదాయ పద్ధతిలో రక్షబంధన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు. పాల్గొన్నారు.

590వ రోజుకు బెంతొరియాల దీక్ష

విశాలాంధ్ర - కవిటీ : కుల ధ్రువీకరణ పత్రాల సమస్యపై కవిటిలో బెంతొరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంకు 590వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారికి మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్పీ. నారాయణస్వామి, కవిటి మాజీ సర్పంచ్ ఆరంగి మధు, పి.రమేష్, గార అంగదరావు తదితరులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బెంతొ రియాలు మాట్లాడుతూ సమస్య పరిష్కరమ్యే వరకు పోరాటం ఆగదని అన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలో తే 09.08.2025 శనివారం నాడు ఉదయం 11 గం నుండి సాయంత్రం 5 గం వరకు-16 విస్తరణకు విద్యుత్ లైన్లు మార్చుట నిమిత్తం 33/11 కే వి రణస్థలం విద్యుత్ ఉప కేంద్రంలోని 11 కేవీ రణస్థలం టౌన్ ఫీడర్ పరిధిలో గల జెఆర్‌పురం కాలనీ, కొత్త పెట్రోల్ బంక్ ఏరియా, జగనన్న కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగును. కావున వినియోగదారులు సహకరించగలరని రణస్థలం ఎఈ తిరుపతి రావు కోరారు.

వర్షాలు లేక వంశధార నీరు అందక ఎండుతున్న వరి నారు, ఎదలు

విశాలాంధ్ర - టెక్కలి : టెక్కలి డివిజన్ కేంద్రానికి కూత వేటు దూరంలో గల పాతనౌపడ రెవిన్యూ గ్రామం పరిధిలో పాత నౌపడ, జండాపేట, సీతానగరం, నౌపడ రైతులు వర్షాలు లేక వంశధార నీరు అందక వరి నారు, ఎదలు మళ్ళు ఎండిపోతున్నాయి. సాగు నీరు లేక మాడిపోతున్న వరిని చూసి రైతులు గుండె బాదుకొని కన్నీరు కారుస్తున్నారు. యేటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వంశధార నీరు కాలువలు ద్వారా పాతనౌపడ అనంత సాగరం చెరువుకు వస్తే, ఆ చెరువు నుండి జండాపేట కొత్త చెరువుకు, బడే చెరువుకు వంశధార నీరు ప్రవహించి సుమారు 300 ఎకరాలు వరి పంటను రైతులు పండించేవారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న వంశధార నీరు సరఫరా చేయడంలో వంశధార అధికారులతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే విత్తనాలు, దుక్కి, క్రిమిసంహారక మందులు కొరకు మదుపులు పెట్టిన రైతులకు వర్షాలు లేక, వంశధార నీరు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురై ఆందోళన చెందుతున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ జరిపే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు సొంత నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతమైన జండాపేట ప్రాంతంలో కరువు ఛాయలు నెలకొన్న స్పందించకపోవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జండాపేట, పాతనౌపడా, సీతా నగరం, నౌపడ లోతట్టు ప్రాంత రైతులకు వంశధార నీరు సరఫరా అయ్యేలా మంత్రి అచ్చన్నాయుడు చొరవ తీసుకొని వరి నారు మళ్ళు, ఎద మళ్ళు ఎండిపోకుండా కాపాడాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

భూమనపై చర్య తీసుకొని అరెస్టు చేయాలి
టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట

విశాలాంధ్ర - కొత్తూరు : ఒకదళిత యువకుడు.ని చితక బాదిన కేసులో వైసిపి. నేత భూమన కరుణాకర్ రెడ్డిని అనుచరులను తక్షణమే అరెస్టు. చెయ్యలని జిల్లా టీడీపీ అధ్యక్షులు కల మట వెంకటమణ మూర్తి డిమాండ్ చేశారు. శు క్రవారం ఇక్కడ మీడియాతో ఆయన మాట్లాడారు వైసిపి నేతల. అరాచకాలును చూస్తూ కూటమి ప్రభుత్వం ఊరుకోదని టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట అన్నారు. హోం మినిస్టర్ అనితా పై వైసిపి వాళ్ళ అనుచిత వ్యాఖ్యలను కలమట. ఖండించారు.

పచ్చని ఉద్యానవనాన్ని విధ్వంసం చేయొద్దు : ఎఐకేయం జాతీయ నాయకులు హరనాథ్

విశాలాంధ్ర - పలాస-మందస : పచ్చని ఉద్యానవనాన్ని కార్గో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు పేరుతో విధ్వంసం చేయొద్దని ఏఐకేఎం జాతీయ నాయకులు హరినాథ్ అన్నారు. శుక్రవారం పలాస నియోజకవర్గం మందస వజ్రపుకొత్తూరు మండలాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దానంలో 1384 ఎకరాలు 16 గ్రామాల్లో కొండలు గుట్టలతో సహా మూడు పంటలు పండే సుక్షేత్రమైన భూములను కార్గో ఎయిర్ పోర్టుకు సేకరించాలని ప్రయత్నాలను అడ్డుకునే గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను తీసుకునేందుకు అఖిల భారత కిసాన్ మహాసభ బృందం పర్యటించడం జరిగిందన్నారు. మందస మండలం నీల గంగువాడ గ్రామంలో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షులు కొమరం వాసు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వానికి అధికారులకు విన్నవించామని తెలియజేశారని గ్రామంలో సేకరణకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డగించటంతో వెళ్ళిపోయారని తెలిపారు. అటవీ భూములతో పాటు ఊరకొండ, రట్టికుండ ,మాలకొండ, బోర్ల కొండ అనే నాలుగు కొండలు కూడా అప్పగించారని తెలిపారు. జంతి గెడ్డ ఛానల్ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కొరకు గతంలో అప్పటి మంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ, దివంగత ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు శంకుస్థాపనలు చేశారని అది ఈనాటికీ నిర్మాణానికి నోచుకోలేదని అనేక సార్లు వినతులు అందజేసిన పనులు చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. సుమారు 60 ఎకరాలు ఆ నీటితో వరి పంట, మిగిలిన భూమంతా కొబ్బరి జీడి, పనస, మామిడి, అరటి పంటల పండించుకుంటున్నారని రైతులు తెలిపారన్నారు. ఈ ప్రాంతంలో 60 అడుగులలో నీరు పడుతుందని ఇప్పుడు ఆ భూములు ఖాళీ చేయిస్తే మా బతుకులు బజారు పాలు అవుతాయని ప్రభుత్వం తమ ప్రతిపాదన వెనక్కి తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారన్నారు. రైతులకు అఖిల భారత కిసాన్ మహాసభ పూర్తి మద్దతు ఇస్తుందని రాష్ట్ర కార్యదర్శి డీ హరినాథ్ తెలిపారు. సోంపేట రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని కోరారు. రాష్ట్రంలో కరేడు రైతాంగం సోలార్ విద్యుత్ ఇండోసోల్ కంపెనీకి తమ భూములు ఇవ్వమని పోరాడుతున్నారని తెలిపారు. కర్ణాటకలో 1777 ఎకరాలు 1900 రోజులు పైగా పోరాడి సాధించుకున్నారని హరినాథ్ తెలిపారు. ఈ పర్యటనలో సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకులు మద్దెల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, మద్దెల రామారావు, దుష్యంత్, టీ.అరుణ, నారాయణ, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో శ్రావణమాస ప్రత్యేక కుంకుమ పూజలు

విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువైయున్న శ్రీ వారాహి మధుకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పర్వదిన సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి తెల్లవారు మొదలు

మధ్యాహ్నం వరకు ఈ పూజా కార్యక్రమంలో జరిగాయి అనేక గ్రామాల నుండి మహిళలు పాల్గొని కుంకు మార్చన చేపట్టారు ఆలయ అర్చకులు మహిళలచే అనేక పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు.

ఎరువుల అక్రమ తరలింపుపై జేసీ ఆగ్రహం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఖరీఫ్ సీజన్లో రైతులకు అందించాల్సిన ఎరువుల ను అక్రమంగా తరలించడం పై జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రైతులు ఎరువులపై పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎరువుల నిల్వ గోదాముల ను శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఎంసీ గోదాం లో ఉంచిన నిల్వలు పై వివరాలు అడిగి తెలుసు కున్నారు. వ్యవసాయ అధికారులు ఇచ్చిన సమా చారంతో సంతృప్తి చెందని జెసి రెండు రోజుల క్రితం ఆర్ఎస్కే లకు తరలించమని ఆర్డర్స్ అందిం చినప్పటికీ ఎందుకు జాప్యం జరిగిందని నిలదీశారు. ఏఎంసీ గోదాంలో సుమారు 400 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ శుక్రవారం తరలించాలని రైతులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సెలవులను చూడకుండా వారికి అందించాలని ఆదేశించారు. మూడు రోజుల క్రితం రైల్వే గూడ్స్ గోదాం ద్వారా ప్రైవేటు డీలర్లకు ఎరువులను తరలించిన వ్యాపారి కృత్రి మ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో విక్రయాలు చేసేందుకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారని తెలుసుకున్న జేసి ఆటు అధికారులు ఇటు వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే రేఖ ద్వారా వచ్చిన మొత్తం ఎరువులు ఎన్ని టన్నులు ఏ రిటైలర్ కు ఎంత అందించారు పూర్తి వివరాలు వ్యవసాయ అధికారులు తక్షణమే అందించాలన్నారు. రిటైలర్ డీలర్‌కు ఏ షాప్ కు ఎంత మొత్తంలో ఎరువులను అందించారు అన్న విషయం తక్షణమే సేకరించి అందించాలని వ్యవసాయ అధికారిగా ఆదేశించారు. రెండు రోజులుగా 400 మెట్రిక్ టన్నులు ఎరువులను ఏఎంసీ గోదాంలో నిల్వంచటంలో కారణాలు అడిగి తెలుసుకున్నా రు. తక్షణమే వాటిని ఆర్ఎస్కే లకు పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులతో పాటు గొదాం ఇన్‌చార్జి కు ఆదేశాలు జారీ చేశారు. డిఏఓ త్రినాథ స్వామి, మార్క్ ఫెడ్ డిఎం రమణి, ఎమ్మార్వో రాంబాబు ఏవో మోహనరావు ఆయన వెంట ఉన్నారు.

బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

కాలి బూడిదైన టెలిఫోన్ ఎక్స్చేంజ్ పరికరాలు

విశాలాంధ్ర - మందస : మందస మండల కేంద్రంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించి టెలిఫోన్ నెట్ వర్క్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. నివాస గృహాల మధ్యలో ఈ కార్యాలయం ఉండటంతో రాత్రి సమయంలో మంటలు చెలరేగడం..పొగలు బయటకు కనిపించడంతో ప్రజలు ఆందోళన చెంది పరుగులు తీశారు. టెలిఫోన్ ఎక్స్చేంజ్ లో నెట్ వర్క్ పరికరాలు కాలి బూడిద కావడంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదంలో ఎంత మేరకు నష్టం వాటిల్లిందన్న అంశంపై బిఎస్ఎన్ఎల్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం బిఎస్ఎన్ఎల్ శాఖ డిఈ రాజేంద్ర, ఎస్‌డిఈ నేతాజీ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కార్యక్రమంలో జేటీఓ పి.మురళి పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ చైతన్య మఠము గో సేవా ఆశ్రమంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - రణస్థలం : గత 4 రోజులుగా అనగా 05-08-2025 నుండి ఉయ్యాలోత్సవం (ఊంజల్ సేవ) తో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 18-08-2025 వరకు కొనసాగించ బడతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మొదటి అయిదు రోజులు శ్రీశ్రీ రాధా గోకులానంద స్వామి వారికి సాయంత్రం సంధ్యా హారతి అనంతరం సుమారు 6:30 ని.లకు ఉయ్యాలోత్సవం జరుగబడుతున్నది. 4వ రోజు స్వామి వారికి వివిధ పుష్పాలంకరణ తో పూలంగి సేవ లో స్వామివారికి ఉయ్యాల ఉత్సవం అతి వైభవంగా జరిగింది. తరువాత ప్రతీ రోజు వివిధమైన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగబడుతున్నాయి. హరినామ సంకీర్తనలతో, భగవంతుని కథా చర్చతో భగవన్నామ జపాదులతో మరియు విద్యుద్దీప కాంతులతో అతి శోభాయమానంగా అంగరంగ వైభవంగా జరుగబడుతున్నాయి. కావున భక్తులందరూ అనేక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమములో పాల్గొని భగవత్ ఆశీర్వాదం మరియు భగవత్ ప్రసాదాన్ని పొందగలరని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పయనం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక జ్ఞానభారతి విద్యార్థులు శు క్రారం పయనమయ్యారు. ఈనెల 9, 10, 11తేదీల్లో నిర్వహించే అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే జట్టులో జ్ఞానభారతి విద్యార్థులు అహిల్ ఆక్బర్‌ఖాన్, ఏ.రాహుల్, ఎం. నగేష్, పి. జగదీష్, ఏ.ఆకాశరావు, ఎన్.లక్ష్మీకాంత్, ఆదిత్య నాయక్ చోటు దక్కటంతో వారిని పాఠశాల ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జోహర్‌ఖాన్ తదితరులు అభినందించి, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీలకు పయనమైన విద్యార్థుల బృంధాన్ని ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ రమణమూర్తి, రషీదా సుల్తానా, ప్రమోద్, అలీంఖాన్ శుభాకాంక్షలు తెలిపి రైల్వే స్టేషన్‌కు సాగనంపారు.

విజయదుర్గ ఆలయంలో విశేష పూజలు

విశాలాంధ్ర - సోంపేట : శ్రావణ శుక్రవారం సందర్భంగా సోంపేట పట్టణ శివారున గల శ్రీవిజయ దుర్గా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా భక్తులు అమ్మవారిని దర్శించారు. శ్రావణమాసంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలకు సంబంధించిన ప్రత్యేకమైన రోజు కావడంతో ఆలయంలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలతో కుంకుమ పూజలు జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరైనప్పటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరికీ సక్రమంగా దర్శనాలు పూర్తయ్యేలా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. అలాగే ఈ నెలలో మొదటి శుక్రవారం కావడంతో ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ భారీస్థాయిలో నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గొర్రి బంధ సంతోషిమాత ఆలయంలో వరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం గొర్రెల గ్రామంలో కొలువైయున్న శ్రీ సంతోష్ మాత ఆలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక వ్రతాలు పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే అనేక ప్రాంతాల నుండి మహిళలు పాల్గొని వ్రతాల్లో భాగస్వాములు అయ్యారు. విడతకు ముప్పది మంది లెక్క పూజలు ఆలయ అర్చకులు సారవకోట సోమేశ్వరరావు నిర్వహించారు. మధ్యాహ్నం 1:00 వరకు నిర్విరామంగా ఈ వ్రతాలు పూజలు జరిపారు.

వేడుకగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - నందిగాం : మండలంలోని పలు గ్రామాలలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. మహిళలు ప్రాతఃకాల సమయంలో స్నాన సంధ్యాదులు చేసి తమ తమ ఇండ్లలో తమ శక్తి కొలది వ్రతాన్ని ఆచరించారు. ఒకరికొకరు వాయినాలు అందిపుచ్చుకున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు

విశాలాంధ్ర - మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు అన్నారు. శుక్రవారం మందస మండలం లోహరిబంద పంచాయతీ ఎల్ కొత్తూరులో సుపరిపాలనకు తొలి ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జి దాసరి తాతారావు ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి దార్శనిక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. పలాస నియోజకవర్గం శాసన సభ్యురాలు అభివృద్ధి ప్రదాత గౌతు శిరీష నాయకత్వంలో ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి కుప్పిలి వెంకటరావు బూత్ ఇంచార్జి లు అందాల మోహనరావు పత్రి తవిటయ్య అందాల బాలరాజు ఊళ్ళ శంకర్ రావు ఆడతాల సోమేశ్వరరావు కోరాడ మోహన్ కొరికాన మాధవరావు ముడిమించి వెంకటరావు మహిళలు పాల్గొన్నారు.

శ్రీ సంతోషిమాత అమ్మవారికి తిరువీధి మహోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం గొర్రెబంద గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సంతోషిమాత అమ్మవారికి శ్రావణమాసం శుక్రవారం సాయంత్రం ఘనంగా తిరువీధి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం మొదలుకొని గ్రామ పురవీధుల్లో మేళతాళాల మధ్య అమ్మవారి ఊరేగింపు జరిగింది. పలువురు మహిళలు తలపై కలశములు ధరించి అమ్మతోపాటు తిరువీధుల పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సారవకోట సోమేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో రైతుల సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోతున్నాయని రైతుకుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎల్లమ్మ గుడి వద్ద రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల రైతులు సమస్యలు ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి రైతు సమస్యలు పరిష్కరించునేలా కృషి జరగాలని సమావేశంలో తీర్మానించుకున్నారు. ఇచ్ఛాపురం మండలంలో గల 11బాహుదా ఛానల్స్‌కు గాను ఒక్కటి మాత్రమే బాగుచేసారని, మిగిలిన 10చానల్స్‌ను కూడా బాగుచేయాలని, వంశదార నీటిని బాహుదానదికి అనుసంధానించాలని, కొళిగాం- పాయితారి కీర్తిపురం పంచాయితీల పరిదిలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, ఈదుపురం వరద గట్టు నిర్మాణ పనులు చేపట్టాలని సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆశి చిరంజీవులు, దుర్గాశి పాపారావు, కూర్మారావు, దక్కత విశ్వనాథం, ప్రకాష్, మేఘనాద్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక పారాయణాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : శ్రావణ శుక్రవారం వ్రతం సందర్భంగా స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో అర్చకులు నరసింహమూర్తి ఆచార్యులు ఆధ్వర్యంలో కుంకుమార్చనలు జరిపించగా, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణలు చేసారు. పెద్ద జగన్నాథస్వామి దేవాలయంలో లక్ష్మీదేవి ఉపాలయంలో పద్మకుమార్ ఆచార్యులు, ఎస్.ఎన్ గోపాలక్రిష్ణమాచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి 1008 పరిమళ పుష్పాలతో సహస్రనామార్చనలు జరిపించారు.